

ఈశాన్యం ఉగ్రరూపం

● మూడురోజులకే ముప్పుతిప్పలు ● ఎడతెరిపిలేని వర్షాలతో స్తంభించిన జనజీవనం
● నేడు 18 జిల్లాలకు వర్షసూచన



పొల్లాచ్చి సమీపం పాలారు తీరంలో జలదిగ్బంధంలో ఆంజనేయస్వామి ఆలయం

చెన్నై, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించిన మూడు రోజులకే ఉగ్రరూపం దాల్చటంతో చెన్నై, పరిసర జిల్లాల్లో, కావేరి డెల్టా జిల్లాలో కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి. అరేబియా సముద్రంలో శనివారం కేంద్రీకృతమైన అల్పపీడనం కారణంగా పలు జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. నీలగిరి, కోయంబత్తూరు, తిరుప్పూరు, ఈరోడ్, తేని, విరుదునగర్, రామనాథపురం, తూత్తుకుడి, తెన్‌కాశి, తిరునల్వేలి, కన్నియాకుమారి జిల్లాల్లో ఆదివారం వేకువజామున చిరుజల్లులతో ప్రారంభమైన వర్షాలు మధ్యాహ్ననికి కుండపోతగా మారాయి. దీంతో నీలగిరి సహా 11 జిల్లాల్లో లోతట్టు ప్రాంతాలన్నీ దీవుల్లా మారాయి. రోడ్లపై వర్షపునీరు ప్రవహించగా, పెనుగాలులకు చెట్లు కూలిపడ్డాయి. ముఖ్యంగా ఊటీ - కున్నూరు మధ్య ఏడు ప్రాంతాల్లోని రహదారులపై భారీ వృక్షాలు కూలిపడ్డాయి. తేని, రామనాథపురం, కన్నియాకుమారి జిల్లాల్లో ఇళ్లలోకి వర్షపు నీరు ప్రవేశించింది. రానున్న పది రోజుల్లో బంగాళాఖాతంలో రెండు అల్పపీడనాలు ఏర్పడనుండటంతో వారంరోజుల వరకు రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయని వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు చెబుతున్నారు. ముందే రానున్న అల్పపీడన ప్రభావంతోనూ భారీగా వర్షాలు కురవనున్నాయి. సోమవారం 18 జిల్లాల్లో వర్షాలు కురవనున్నాయని వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. ఆ మేరకు కోవై, నీలగిరి, తిరుప్పూరు, ఈరోడ్, దిండుగల్, తేని, మదురై, విరుదునగర్, రామనాథపురం, శివగంగ, పుదుకోట, తంజావూరు, తిరువారూరు, నాగపట్టినం, మైలాడుదురై, కడలూరు, విల్లుపురం, చెంగల్పట్టు జిల్లాల్లో భారీగా వర్షాలు కురుస్తాయని ప్రకటించారు. మంగళవారం చెన్నై, చెంగల్పట్టు సహా 12 జిల్లాల్లో, బుధవారం చెన్నై, తిరువళ్లూరు, చెంగల్పట్టు, కాంచీపురం సహా 16 జిల్లాల్లో, గురువారం చెన్నై, వేలూరు, తిరువళ్లూరు, కాంచీపురం సహా 6 జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశారు. ఇదే విధంగా ఈ నెల 24, 25 తేదీలలోనూ మరి కొన్ని జిల్లాల్లో చెదురుముదురుగా వర్షాలు కురుస్తాయని తెలిపారు.

పొల్లాచ్చిలో...

పొల్లాచ్చిలోనూ గత రెండు రోజులుగా భారీగా వర్షాలు కురిశాయి. పొల్లాచ్చి పరిసర ప్రాంతాల్లో శనివారం అర్థరాత్రి చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. వర్షాల కారణంగా ఆనమలై సమీపం పాలారు తీరంలోని ఆంజనేయస్వామి ఆలయం జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఆ ఆలయ వాచ్‌మెన్లు మహాలింగం (60), జయకుమార్ (58) వరద నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని వారిని కాపాడారు.

ఊటీ కొండ రైలు రద్దు...

నీలగిరి జిల్లా ఊటీ, కున్నూరు, కొత్తగిరి పరిసర ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురిశాయి. శనివారం రాత్రి కురిసిన వర్షాలకు మేట్టుపాళయం - కున్నూరు రైలు మార్గంలో పలు చోట్ల బండరాళ్లు, మట్టి పెళ్లలు జారి పడ్డాయి. దీంతో ఆదివారం మేట్టుపాళయం - కున్నూరు, కున్నూరు - ఊటీ మధ్య కొండ రైలు సర్వీసు రద్దయ్యింది. అదే సమయంలో పట్టాలపై పడిన బండరాళ్లు, మట్టిపెళ్లలను రైల్వే కార్మికులు తొలగించారు. వర్షంతో పాటు పెనుగాలులు తోడవడంతో ఊటీలో ఏడు చోట్ల చెట్లు కూలిపడ్డాయి. అగ్నిమాపక శాఖ, హైవేస్ శాఖల సిబ్బంది చెట్లను తొలగించారు.



మేట్టుపాళయం - కున్నూరు మధ్య కొండ రైలు మార్గంలో పట్టాలపై పడిన బండరాళ్లను తొలగిస్తున్న కార్మికులు

జలదిగ్బంధంలో ఇళ్లు...

కున్నూరు పరిసర ప్రాంతాల్లో గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు దీవులుగా మారాయి. పలు ప్రాంతాల్లో ఇళ్లలోకి వరదనీరంతా రావడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. కున్నూరు రైతు బజారు సమీపంలోని మాడల్ హౌస్ ప్రాంతం వద్ద మూడోసారి ఇళ్లలోకి వర్షపునీరు చేరింది. ఈ సమాచారం అందుకున్న కార్పొరేషన్ అధికారులు హుటాహుటిన ఇళ్లలో చేరిన వర్షపునీటిని తొలగించారు. ఆట్టి డాల్ఫిన్ నోస్, కరుపాలం, క్లిండేల్ ప్రాంతాల్లో రహదారులపై చెట్లు కూలిపడటంతో వాటిని కార్మికులు తొలగించారు. కున్నూరు - కట్టబెట్టు రహదారిలోని వండిసోలై, కొడనాడు ప్రాంతాల్లోని రోడ్లపై బండరాళ్లు జారిడి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయమేర్పడింది.



ఊటీలో కూలిపడిన చెట్టును తొలగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రాజధానిలో...

రాజధాని నగరం చెన్నైలో శనివారం రాత్రి పది గంటల నుండి ఆదివారం వేకువజాము వరకూ ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. రాయపేట, చేపాక్, ట్రిప్లికేన్, టి.నగర్, పురుషవాక్కం, అడయార్, తాంబరం, ఆవడి, అంబత్తూరు, మధురవాయల్, కోయంబేడు, సైదాపేట, ప్యారీస్ కార్నర్, రాయపురం తదితర ప్రాంతాల్లో వర్షాలకు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

జాలర్లకు హెచ్చరిక...

ఇదిలా ఉండగా ఈశాన్య రుతుపవనాలు తీవ్రరూపం దాల్చటంతో వచ్చే ఐదురోజులు జాలర్లు చేపలవేటకు వెళ్లొద్దని వాతావరణ కేంద్రం దక్షిణ మండల అధికారి అముద తెలిపారు. రాష్ట్రంలో, పుదుచ్చేరిలో మరో నాలుగు రోజులపాటు భారీగా వర్షాలు కురుస్తాయని తెలిపారు. మన్నార్ జలసంధి, కన్నియకుమారి తదితర ప్రాంతాల్లో పెనుగాలులు వీచే అవకాశం ఉండటంతో జాలర్లు ఐదు రోజులు చేపలవేటకు స్వస్తి పలకాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ నెల 23న నగరంలో భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసినట్లు తెలిపారు.

చంద్రబాబుతో రవిబాబు భేటీ



అమరావతిలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితో ఆదివారం మర్యాదపూర్వకంగా భేటీ అయిన ఐజేకే ఉప ప్రధాన కార్యదర్శి, టీటీడీ చెన్నై సమాచార కేంద్ర సలహా కమిటీ మాజీ సభ్యుడు ఎం.రవిబాబు.

సొంతూళ్ల బాట పట్టిన జనం

● పది గంటల పాటు స్తంభించిన ట్రాఫిక్ ● 6 కి.మీ.ల మేర ఆగిన వాహనాలు

ప్యారీస్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ కోసం నగరం నుండి స్వస్థలాలకు బయలుదేరిన వారితో ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. దక్షిణాది, ఇతర ప్రాంతాలకు బస్సులు, టూరిస్ట్ వాహనాలు, రైళ్లు, సొంతవాహనాల్లో ఈ మూడురోజులు సుమారు 12 లక్షల మంది వెళ్లారు. దీంతో రాజధాని నగరంలోని ప్రధాన రహదారులు, రద్దీ ప్రాంతాలు, నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. ప్రజల కోసం కోయంబేడు, పెరుంగళత్తూరు, మాధవరం, కీలాంబాక్కం తదితర బస్ టెర్మినళ్లను ప్రత్యేక బస్సులు, సెంట్రల్ రైల్వేస్టేషన్, ఎగ్మూర్, తాంబరం తదితర రైల్వే స్టేషన్ల నుండి ప్రత్యేక రైళ్లు నడిపారు. శుక్రవారం నగరం నుండి రాష్ట్ర రవాణా సంస్థ 2100 బస్సులతో పాటు అదనంగా 1895 ప్రత్యేక బస్సులను నడిపింది. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం నుండే నగరంలోని రెండు వైపు ప్రధాన రహదారులు దక్షిణాది నగరాలకు బయలుదేరిన బస్సులతో కిటకిటలాడాయి. దక్షిణాది నగరాలకు చెన్నై - తిరుచ్చి జాతీయ రహదారిలో, కోయంబేడు - పూందమల్లి రహదారిలో పదిగంటల పాటు వాహనాల రాకపోకలు స్తంభించాయి. శుక్రవారం సాయంత్రం 6 గంటల నుండి ఆదివారం వేకువజాము 3.45 గంటల దాకా ఈ రెండు మార్గాలలో రాష్ట్ర రవాణా సంస్థ రోజువారీ బస్సులు, దీపావళి ప్రత్యేక బస్సులు, ఆమ్నిబస్సులు ఒకే సమయంలో దక్షిణాది జిల్లాలవైపు బయలుదేరటంతో నగరంలోని ప్రధాన రహదారులు అస్తవ్యస్తంగా మారాయి.

స్వర్ణాలయం వేడుకలకు రాష్ట్రపతికి ఆహ్వానం



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న పీఠం జీఎం సంపత్, చిత్రంలో కేంద్ర మంత్రి మురుగన్

వేలూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వేలూరులోని శ్రీపురం స్వర్ణాలయంలో జరగనున్న వార్షిక వేడుకలకు రాష్ట్రపతిని పీఠం ఆహ్వానించింది. ఆదివారం ఉదయం పీఠం జనరల్ మేనేజర్ సంపత్ ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్రమంత్రి ఎల్.మురుగన్‌లను కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఆలయ వేడుకలకు హాజరై అమ్మవారిని దర్శించుకోవాలని ఈ సందర్భంగా సంపత్ రాష్ట్రపతిని కోరారు.


కరూర్ క్షతగాత్రులకు రూ.2లక్షలు

● టీవీకే అధినేత విజయ్



చెన్నై, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కరూర్‌లో సెప్టెంబర్ 27రాత్రి నిర్వహించిన రోడ్‌షోలో జరిగిన తొక్కిసలాటలో గాయపడినవారికి కూడా త్వరలోనే తలా రూ.2లక్షల చొప్పున ఆర్థికసాయం అందిస్తామని టీవీకే నేత విజయ్ ప్రకటించారు. తొక్కిసలాటలో మృతి చెందిన 41 మంది కుటుంబాలకు ఆయన తలా రూ.20 లక్షల చొప్పున వారి బ్యాంక్ ఖాతాలలో జమచేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రోడ్‌షోలో మందమందికి పైగా గాయపడి పలు ఆస్పత్రుల్లో చికిత్స పొంది కోలుకున్నారు. ప్రభుత్వం వీరికి లక్ష రూపాయల నుండి రూ.50వేల చొప్పున ఆర్థికసాయం అందజేసింది. ఈ నేపథ్యంలో టీవీకే తరఫున క్షతగాత్రులకు తలా రూ.2లక్షల ఆర్థిక సాయం అందజేస్తామని విజయ్ ఆదివారం మధ్యాహ్నం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం కరూర్ జిల్లాకు చెందిన పార్టీ నాయకులు గాయపడినవారి బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన వివరాలు సేకరిస్తున్నారని, ఆ తరువాత ఖాతాల్లో తలా రూ.2లక్షలను జమ చేస్తామని విజయ్ పేర్కొన్నారు. కరూర్ దుర్ఘటన మృతుల కుటుంబీకులందరినీ త్వరలోనే తాను నేరుగా కలుసుకుని పరామర్శిస్తానని, ఆ దిశగానే పార్టీ నిర్వాహకులు పోలీసుల అనుమతి కోసం ప్రయత్నిస్తున్నారని ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా శనివారం టీవీకే ద్వారా రూ.20లక్షల సాయం పొందిన మృతుల కుటుంబాలకు చెందిన కొందరు మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే ఘనవిజయం సాధిస్తుందని, ఈ విషయంలో విజయ్ అధైర్యపడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

25న కోవై రానున్న అమిత్ షా



పెరంబూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ఈ నెల 25వ తేదీ కోయంబత్తూరుకు రానున్నారు. అక్కడి ఈషా యోగా కేంద్రంలో ఈ నెల 26వ తేదీ జరుగనున్న ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొనేందుకు వస్తున్నట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి. విమానంలో 25వ తేది రాత్రి 7 గంటలకు కోవై చేరుకోనున్న అమిత్‌షా.. ఆ రోజు రాత్రి అవినాసి రోడ్డులోని ఓ హోటల్‌లో బసచేయనున్నారు. కోవై పీలమేడులో నిర్మించిన బీజేపీ పార్టీ కార్యాలయాన్ని 26వ తేది ఉదయం అమిత్ షా ప్రారంభించనున్నారు. అనంతరం మధ్యాహ్నం ఒంటిగంటకు పార్టీ రాష్ట్ర నాయకులతో ఆయన సమావేశం కానున్నారు. సాయంత్రం 5.30 గంటలకు ఈషా యోగా కేంద్రంలో జరిగే వేడుకల్లో పాల్గొని, రాత్రి 8 గంటలకు ఢిల్లీ బయల్దేరి వెళ్లనున్నారు. కోవై రానున్న కేంద్ర మంత్రి అమిత్ షాకు విమానాశ్రయం, పార్టీ కార్యాలయం తదితర ప్రాంతాల్లో మేళతాళాలతో స్వాగతం పలికేందుకు పార్టీ నేతలు సిద్ధమవుతున్నారు. పోలీసు శాఖ భద్రత కట్టుదిట్టం చేస్తోంది.

విరాలిమలైలో 22 నుంచి స్కందషష్ఠి వేడుకలు
7 లో...
రాష్ట్రంలో ఆస్ట్రేలియా జలవనరుల బృందం పర్యటన

రాష్ట్ర ప్రజలకు గవర్నర్ సహా నేతల దీపావళి శుభాకాంక్షలు

ప్యారీస్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వెలుగులు విరజిమ్మే దీపావళి పండుగను సోమవారం జరుపుకోనున్న రాష్ట్రప్రజలకు గవర్నర్ ఆర్‌ఎన్ రవి, ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి తదితర రాజకీయ పార్టీల నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు వెలుగుల పండుగ సందర్భంగా ఐక్యతగా జరుపుకుని మతసామరస్యాన్ని చాటాలని గవర్నర్ ఆర్‌ఎన్ రవి పిలుపునిచ్చారు. పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి తన ప్రకటనలో నరకాసురుడుని పెరుమాళ్ వధించిన రోజును దీపావళిగా జరుపుకుంటున్న ప్రజలు సుభీక్షంగా ఉండాలని వెలుగుల పండుగ సందర్భంగా రాష్ట్రంలో చీకటి పాలన వైదొలిగేలా ప్రజలు ప్రార్థించాలని ఆయన కోరారు. తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ)అధ్యక్షుడు సెల్వపెరుంతగై, పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, తమిళమానిల కాంగ్రెస్ అధ్యక్షుడు జీకేవాసన్, బీజేపీ అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, తమిళనాడు మట్టిపాత్రల తయారుదారుల సంఘం అధ్యక్షుడు సేమానారాయణన్ తదితర నేతలు కూడా దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

సేలం జిల్లాలో 6 చోట్ల నామ్ తమిళర్ కట్చి పోటీ

● మేట్టూర్‌లో వీరప్పన్ కుమార్తె

చెన్నై, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లాలోని 11 నియోజకవర్గాలకుగాను 6 నియోజకవర్గాల్లో పోటీచేసే నామ్ తమిళర్ కట్చి (ఎన్టీకే) అభ్యర్థులను ఆ పార్టీ సమన్వయకర్త సీమాన్ ప్రకటించారు. మేట్టూరు అసెంబ్లీ నియోజకవర్గంలో చందనపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ కుమార్తె విద్య పోటీ చేస్తారని తెలిపారు. మేట్టూరులో శనివారం రాత్రి జరిగిన పార్టీ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆ సందర్భంగా వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్న ఆరుగురితో అభ్యర్థుల తొలిజాబితాను విడుదల చేశారు. ఆ మేరకు సంగగిరి నియోజకవర్గంలో నిత్యా అరుణ్, వీరపాండి నియోజకవర్గంలో రాజేష్ కుమార్, సేలం వెస్ట్‌లో సురేష్‌కుమార్, కెంగవల్లిలో అభిరామి, ఆత్తూరులో మోనిషా పోటీ చేయనున్నారు. వచ్చే యేడాది ఫిబ్రవరి 7న తిరుచ్చిలో జరుగనున్న పార్టీ మహానాడులో మిగిలిన 228 నియోజకవర్గాలలో పోటీ చేయనున్న అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తానని సీమాన్ తెలిపారు.



మేట్టూరు బహిరంగ సభలో అభ్యర్థులను పరిచయం చేస్తున్న నామ్ తమిళర్ కట్చి సమన్వయకర్త సీమాన్

వైరల్ జ్వరాలపై తస్మాత్ జాగ్రత్త

పెరంబూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో డెంగ్యూ, ఫ్లూ సహా వైరల్ జ్వరాలు ప్రబలే అవకాశముందని, అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆరోగ్య శాఖ సూచించింది. ఈ మేరకు అన్ని జిల్లాల ఆరోగ్య అధికారులకు ఆరోగ్య శాఖ డైరెక్టర్ సోమసుందరం సర్క్యులర్ పంపారు. ఈశాన్య రుతుపవనాలతో అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశముందని భారత వాతావరణ పరిశోధన కేంద్రం హెచ్చరించిందన్నారు. ఈ సమయంలో, వైరల్ జ్వరాలు, అంటు వ్యాధులు ప్రబలే అవకాశముందని, వ్యాధులు వ్యాప్తి చెందకుండా అన్ని జిల్లాల అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వాసుపత్రుల్లో అత్యవసర మందులు, ఉపకరణాలు సిద్ధం చేయాలన్నారు. జనరేటర్లు, ఆక్సిజన్ వ్యవస్థ సక్రమంగా పనిచేస్తాయా? లేదా? అని పర్యవేక్షించాలని, ఆసుపత్రుల ప్రాంగణాల్లో నీరు నిల్వ చేరకుండా చర్యలు చేపట్టాలన్నారు. వరద నష్టం జరిగితే ఆస్పత్రుల్లో రోగులు, పసికందులను వెంటనే తరలించేలా సౌకర్యాలు ఏర్పాటుచేయాలన్నారు. ఇళ్లకు సరఫరా చేసే తాగునీటిలో క్లోరిన్ కలపాలని సూచించారు. ఆసుపత్రుల్లో రోగుల సంఖ్యను బట్టి పడకల వసతి పెంచేలా చర్యలు చేపట్టాలని ఆరోగ్య శాఖ డైరెక్టర్ సర్క్యులర్‌లో పేర్కొన్నారు.

రాందాస్, అన్బుమణి నివాసాలకు బాంబు బెదిరింపు

పెరంబూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పీఎంకే వ్యవస్థాపకులు డా.రాందాస్, ఆయన కుమారుడు అన్బుమణి ఇళ్లకు బాంబు బెదిరింపు వార్త కలకలం రేపింది. విల్లుపురం జిల్లా తైలాపురంలోని రాందాస్ ఇల్లు, స్థానిక టి.నగర్‌లోని అన్బుమణి ఇంటిలో బాంబులుంచినట్లు డీజీపీ కార్యాలయానికి ఈ-మెయిల్ ద్వారా బెదిరింపు అందింది. దీంతో, రాందాస్, అన్బుమణి ఇళ్లలో పోలీసులు, బాంబ్ స్క్వాడ్ నిపుణులు ముమ్మర తనిఖీలు చేపట్టి, ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించారు. బాంబు బెదిరింపు పాల్పడిన ఈ-మెయిల్ చిరునామా కోసం పోలీసులు విచారిస్తున్నారు. అదే సమయంలో, నగరంలోని పోయెస్‌గార్డెన్ బీస్నీ రోడ్డులోని ఉప రాష్ట్రపతి నివాసం సహా మరో ఎనిమిది ప్రాంతాలకు కూడా బాంబు బెదిరింపులు రావడంతో ఆయా ప్రాంతాల పోలీసులు బాంబ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు.

గుట్కా విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

వేలూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లావ్యాప్తంగా గత కొన్ని నెలలుగా అక్రమంగా గంజాయి, గుట్కాను తరలిస్తున్నారన్న సమాచారంలో పోలీసులు ఆ ప్రాంతంలో నిఘా పెంచారు. ఈ నేపథ్యంలో, శనివారం పోలీసులు వేలూరు జాతీయ రహదారిపై వాహన తనిఖీలు నిర్వహించారు. ఆ ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు యువకులను తనిఖీ చేసి, వారివద్దనున్న 2.3 కిలోల గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. విచారణలో వారు వేలూరు విరూపాక్షిపురంలోని గంగమ్మన్‌కోవిల్‌వీధికి చెందిన జానకిరామన్ (27), అదే ప్రాంతానికి చెందిన శివ (23)గా గుర్తించారు. అనంతరం కోర్టు ఉత్తర్వుల మేరకు వారిని రిమాండ్‌కు తరలించారు.



పోలీసుల అదుపులో నిందితుడు

కష్టించి పని చేస్తే పార్టీ పదవుల్లో ప్రాధాన్యం

● అన్నాడీఎంకే నేత మాధవరం మూర్తి

ప్యారీస్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కష్టించి పనిచేసి అన్నాడీఎంకేను గెలిపించే బూత్ కమిటీ ప్రతినిధులు, కార్యకర్తలకు పార్టీ కమిటీల్లో ప్రాధాన్యం కల్పిస్తామని మాజీమంత్రి మాధవరం మూర్తి హామీ ఇచ్చారు. దీపావళి పండుగను పురస్కరించకుని తిరువళ్లూరు జిల్లా తూర్పు అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ జిల్లా నిర్వాహకులకు దీపావళి కనుకగా నూతన వస్త్రాలు, బాణసంచా, మిఠాయిలు తదితరాలను పంపిణీ చేశారు. పార్టీ సర్వసభ్య మండలి సభ్యులు ఎం.సుందర్, తిరువళ్లూరు తూర్పు జిల్లా అమ్మాపేరవై డిప్యూటీ కార్యదర్శి లయన్ జి.మురళి, బాలాజీ, కుమార్ తదితరుల సత్కారం అందుకున్న అనంతరం మూర్తి మాట్లాడుతూ, పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి సూచన మేరకు తిరువళ్లూరు జిల్లాలోని అన్ని శాసన సభ నియోజకవర్గాల్లో పార్టీ ఓటు బ్యాంకు పెరిగేలా ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు.



మాధవరం మూర్తిని సత్కరిస్తున్న సుందర్, మురళి తదితరులు

పండుగ పూట విషాదం: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

● భర్త, ఇద్దరు పిల్లలకు గాయాలు

పెరంబూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నానగర్‌లో మోటార్ సైకిల్‌ను ఆమ్నీ బస్సు ఢీకొన్న ఘటనలో మహిళ మృతిచెందగా, భర్త, ఇద్దరు పిల్లలకు గాయాలయ్యాయి. అశోక్ నగర్ ప్రాంతానికి చెందిన శివచంద్రన్-దివ్య (32) దంపతులకు 8 ఏళ్ల కుమార్తె, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. దీపావళి సందర్భంగా పిల్లలకు కొత్త బట్టలు కొనేందుకు శనివారం రాత్రి తిరుమంగళంలోని ఓ షాపింగ్ మాల్‌కు దంపతులు వెళ్లారు. రాత్రి 11.30 గంటల ప్రాంతంలో కొనుగోళ్లు ముగించుకుని మోటార్ సైకిల్‌పై ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. అరుంబాక్కం 100 అడుగుల రోడ్డుపై వస్తుండగా, ఊహించని విధంగా ఆమ్నీ బస్సు వారి బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో బైక్ నుంచి కిందపడిన దివ్యపై బస్సు చక్రం ఎక్కడంతో ఆమె ఘటనా స్థలంలోనే మృతి చెందింది. సమాచారం అందుకున్న అన్నా నగర్ ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రవిచంద్రన్, ఇద్దరు పిల్లలను చికిత్స నిమిత్తం కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దివ్య మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, ప్రమాదానికి కారణమైన ఆమ్నీ బస్సు డ్రైవర్ పల్లావరం ప్రాంతానికి చెందిన నాగరాజ్ ఆదివారం ఉదయం అన్నా నగర్ ట్రాఫిక్ విభాగం పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు.



మృతురాలు దివ్య (ఫైల్‌ఫొటో)

ముఖ్యమంత్రి గారూ...సత్వరం తేనికి వెళ్లండి

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్

పెరంబూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేలా ముఖ్యమంత్రి స్టాలిన్ వెంటనే తేనికి వెళ్లి, యుద్ధప్రాతిపదికన సహాయక చర్యల పర్యవేక్షించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... తేని జిల్లా, ప్రస్తుతం వరద ముంపులో చిక్కుకుందన్నారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే కాలువల్లో పూడికతీత, గట్లు పటిష్టత తదితరాలు చేపట్టి ఉండే ఈ విపత్తు సంభవించి ఉండేది కాదన్నారు. ముల్లైపెరియార్ డ్యాం నుంచి నాలుగు రోజుల క్రితం 1,000 ఘనపుటడుగుల నీరు మాత్రమే విడుదల చేశారని, శనివారం రాత్రి నీటి విడుదల ఒక్కసారిగా 7,163 ఘనపుటడుగులకు పెంచడం ఈ విపత్తు కారణమా? అనే సందేహం నెలకొందన్నారు. సీఎం తేని జిల్లాకు వెళ్లి సహాయక చర్యలు పర్యవేక్షించాలని నయినార్ నాగేంద్రన్ కోరారు.



చెన్నైలో తనను కలుసుకున్న తిరువొత్తియూరు కు చెందిన జే సతీష్‌కుమార్‌కు పీఎంకే డిప్యూటీ కార్యదర్శిగా నియామక పత్రాన్ని అందజేస్తున్న ఆ పార్టీ నేత డాక్టర్ అన్బుమణి

వేళచ్చేరి-సెయింట్ థామస్ మౌంట్ రైలు మార్గం పనులు పూర్తి

పెరంబూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వేళచ్చేరి-సెయింట్ థామస్ మౌంట్ మధ్య ఎమ్మార్టీఎస్ రైలు మార్గం పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం చెన్నై బీచ్-వేళచ్చేరి మధ్య నడుపుతున్న ఎమ్మార్టీఎస్ రైలు సేవలు సెయింట్ థామస్ మౌంట్ వరకు పొడిగించాలని నిర్ణయించిన ప్రభుత్వం, రూ.730 కోట్లతో ప్రాజెక్ట్ సిద్ధం చేసింది. 17 ఏళ్ల క్రితం ప్రారంభమైన ఈ పనుల్లో భూసేకరణలో జాప్యం, న్యాయస్థానాల్లో కేసుల విచారణ కారణంగా సుదీర్ఘకాలంగా నిర్మాణపనుల్లో జాప్యం జరిగింది. సమస్యలు సమసిపోవడంతో వేళచ్చేరి-సెయింట్ థామస్ మౌంట్ మధ్య ఎత్తైన స్తంభాలపై రైలు మార్గం, సిగ్నల్ వ్యవస్థ సహా అన్ని పనులు పూర్తయ్యాయి. ట్రయల్ రన్ నడిపి డిసెంబరులో ఎమ్మార్టీఎస్ రైలు సేవలు ప్రారంభించాలని నిర్ణయించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

టపాసుల దుకాణం నడిపిన కానిస్టేబుళ్లపై బదిలీ వేటు

పెరంబూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విరుదు నగర్ జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు, టపాసుల దుకాణాలు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులందయి. ఈ వ్యవహారంపై జిల్లా ఎస్పీ కన్నన్ ఆదేశాలతో ప్రత్యేక పోలీసు బృందం విచారణ చేపట్టింది. విచారణలో... టపాసుల దుకాణాలు నడుపుతూ విధులకు సక్రమంగా హాజరుకాని 8 మందిపై చర్యలు చేపట్టాలని ఎస్పీ సిఫారసులతో, వారిని బదిలీ చేస్తూ దక్షిణ మండల ఐజీ ప్రేమ్ ఆనంద్ సిన్హా ఉత్తర్వులు జారీచేశారు.

రాష్ట్రంలో 58 శాతం అదనపు వర్షపాతం

పెరంబూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నైరుతి, ఈశాన్య రుతుపవనాలతో రాష్ట్రంలో సాధారణం కన్నా 58 శాతం అదనపు వర్షపాతం నమోదైంది. ఈ మేరకు వాతావరణ శాఖ విడుదల చేసిన ప్రకటనలో... ఈ నెల 1వ తేది నుంచి శనివారం వరకు రాష్ట్రంలో సాధారణ వర్షపాతం 88.0 మి.మీ కాగా 58 శాతం అధికంగా 138.7 మి.మీ వర్షపాతం నమోదైంది. రాజధాని నగరం చెన్నైలో సాధారణ వర్షపాతం 112.2 మి.మీ కాగా 25 శాతం అదనంగా 139.9 మి.మీ వర్షపాతం నమోదైందని వాతావరణ కేంద్రం తెలిపింది.

బాలికకు లైంగిక వేధింపులు. పోక్సో చట్టం కింద బాలుడి అరెస్ట్

పెరంబూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన బాలుడిని పోక్సో చట్టం కింద పోలీసులు అరెస్ట్ చేశారు. 13 ఏళ్ల బాలిక, స్థానిక కొడుంగైయూర్ ప్రాంతంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతోంది. ఈ నెల 15న ఆ బాలిక ట్యూషన్‌కు వెళ్లిన సమయంలో, ఆమెపై ఒకరు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బాలిక వేసిన కేకలకు చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకునేసరికి, ఆ వ్యక్తి పరారయ్యాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎంకేబీ నగర్ మహిళా పోలీస్ స్టేషన్ సీఐ కవిత పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి, ఆ ప్రాంతంలో సీసీ ఫుటేజీ పరిశీలించారు. వాటి ఆధారంగా 15 ఏళ్ల బాలుడిని అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరచి జువైనల్ హోంకు తరలించారు.

పారిశుధ్య కార్మికులకు దీపావళి బహుమతులు



పారిశుధ్య కార్మికులకు బహుమతుల పంపిణీ చేస్తున్న సమాజ సేవకుడు భాస్కరన్

వేలూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవకుడు భాస్కరన్ వాసుదేవన్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు ఆదివారం ఉదయం దీపావళి బహుమతులు అందజేశారు. వేలూరు సమీపంలోని కాట్పాడి పరిసర ప్రాంతాల్లోని పారిశుధ్య కార్మికులు, వాటర్ బోర్డు ఉద్యోగులకు ఆదివారం బాణసంచా ప్యాకెట్, కొత్త దుస్తులను భాస్కరన్ అందజేశారు. అనంతరం వారికి స్వీటు పంపిణీ చేసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాట్పాడి సేవా సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఎయిర్‌ఫోర్స్ అధికారి ఆత్మహత్య

అడయార్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లాలోని సూళూరులో ఎయిర్‌ఫోర్స్ ఉన్నతాధికారి ఒకరు ఆదివారం తన రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సూళూరు ఎయిర్‌ఫోర్స్ కేంద్రంలో ఉన్నతాధికారిగా పనిచేసే సాను అనే అధికారి ఆదివారం తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మృతుడిని కేరళ వాసిగా గుర్తించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సివుంది.

రవాణా కార్మికుల సమ్మె విరమణ

పెరంబూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రవాణా కార్మికులకు కొత్త వేతన ఒప్పంద బకాయిల చెల్లింపుతో సహా మూడు కీలక డిమాండ్లు నెరవేరుస్తామని మంత్రి శివశంకర్ హామీ ఇవ్వడంతో, సీఐటీయూ నేతృత్వంలో రవాణా కార్మికులు చేపట్టిన 62 రోజుల సమ్మె తాత్కాలికంగా విరమించారు. ఈ విషయమై సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సౌందర్‌రాజన్ మాట్లాడుతూ మంత్రితో జరిగిన చర్చల్లో అన్ని విషయాలు తెలియజేశామన్నారు. పదవీ విరమణ పొందిన 1,200 మంది కార్మికులకు చెల్లించాల్సిన రూ.2,500 కోట్లను రెండు విడతలుగా పొంగల్ ముందుగా అందజేస్తామని, 15వ వేతన ఒప్పంద బకాయిల చెల్లింపు, పింఛన్‌దారులకు బీమా సదుపాయం కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారని, అందువల్ల 62 రోజులుగా తాము చేపట్టిన సమ్మె తాత్కాలికంగా విరమించుకుంటున్నట్లు సౌందర్‌రాజన్ తెలిపారు.

సమాచార ధ్వని

22 వరకు ప్రత్యేక రైళ్లు దక్షిణ రైల్వే ప్రకటన

ప్యారీస్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని సొంతూళ్లకు వెళ్లేందుకు, అలాగే తిరిగొచ్చే ప్రజల సౌకర్యార్థం ఆదివారం నుండి ఈ నెల 22వ తేదీ వరకు 147 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ రైల్వే ప్రకటించింది. పండుగను సొంతూళ్లలో జరుపుకునేందుకు వెళ్తున్న ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు అందుబాటులోకి వచ్చాయి. ఈ రైళ్ల టైం టేబుల్‌ను దక్షిణ రైల్వే విడుదల చేసింది. తాంబరం-తిరుచ్చి (06191), తిరుచ్చి-తాంబరం (06190), పోతనూర్- చెన్నై సెంట్రల్ (06050), తాంబరం-కన్నియాకుమారి (06133), మదురై-తాంబరం (06162), ఎగ్మూర్-మదురై (06045)తో పాటు 147 ప్రత్యేక రైళ్లను వచ్చే మంగళవారం వరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కేంద్రాల నుండి నడపనున్నట్లు రైల్వేశాఖ అధికారులు ప్రకటించారు.

సిద్ధ, యునానీ పీజీ వైద్యకోర్సుల అడ్మిషన్లు

పెరంబూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భారతీయ వైద్యం, హోమియోపతి శాఖ ఆధ్వర్యంలో, చెన్నై, పాళయంకోటలోని సిద్ధ, యునానీ పీజీ వైద్య కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చు విద్యార్థులు https://tnhealth.tn.gov.in, https://tnayush-selection.org అనే వెబ్‌సైట్‌లలో ద్వారా ఈ నెల 22వ తేదిలోగా దరఖాస్తులు సమర్పించాలని భారతీయ వైద్యం మరియు హోమియోపతి శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

'యాప్' డెవలప్‌మెంట్‌పై శిక్షణ

పెరంబూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు నైపుణ్యాభివృద్ధి సంస్థ 'సర్వీస్ నౌ డెవలపర్' అనే ప్రత్యేక యాప్ రూపొందించడం, డిజైన్ చేయడంపై 60 రోజుల శిక్షణ అందించనుంది. చెన్నై, కోవై, దిండుగల్, ఈరోడ్ తదితర నగరాల్లో నిర్వహించనున్న శిక్షణకు బీఈ-బీటెక్, కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ గ్రాడ్యుయేట్లు ఈ శిక్షణకు అర్హులు. ఆసక్తి కలిగిన వారు candidate.tnskill.tn.gov.in/skillwallet/course/4416 అనే వెబ్‌సైట్‌లో పేర్లు నమోదుచేసుకోవచ్చని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

ఎస్‌బీఐ ద్వారా విద్యుత్ బిల్లుల 'డిజిటల్' చెల్లింపు

పెరంబూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): 'డిజిటల్' విధానంలో విద్యుత్ బిల్లులు చెల్లింపునకు మూడో బ్యాంక్‌గా ఎస్‌బీఐను విద్యుత్ బోర్డు ఎంపిక చేసింది. విద్యుత్ బిల్లులను వసూలు కేంద్రాలు, ప్రభుత్వ ఈ-సేవా కేంద్రాల ద్వారాను, నగదు, చెక్‌లు, డీడీల రూపంలో వినియోగదారులు చెల్లిస్తున్నారు. అలాగే, విద్యుత్ బోర్డు వెబ్‌సైట్, మొబైల్ యాప్, యూపీఐ, గూగుల్ పే, పేటీఎం, ఫోన్ పే తదితరాల ద్వారా డిజిటల్ విధానంలో చెల్లించే సౌకర్యం కల్పించారు. ప్రస్తుతం విద్యుత్ బోర్డుకు డిజిటల్ విధానంలో విద్యుత్ బిల్లుల చెల్లింపు అధికమైంది. ఆ ప్రకారం, 2020-21లో 4.39 కోట్ల మంది రూ.18,740 కోట్లు వసూలుచేయగా, 2025-25లో 9.56 కోట్ల మంది నుంచి రూ.58,285 కోట్లు డిజిటల్ విధానంలో చెల్లించారు. విద్యుత్ బిల్లుల చెల్లింపులో 85 శాతం డిజిటల్ విధానంలో, మిగిలినది విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాల ద్వారా చెల్లిస్తున్నారు. డిజిటల్ విధానంలో ఐఓబీ, కెనరా బ్యాంక్ ద్వారా వసూలవుతోంది. ప్రస్తుతం, మూడో బ్యాంక్‌గా ఎస్‌బీఐని విద్యుత్ బోర్డు ఎంపిక చేసిందని అధికారులు తెలిపారు.

ఐఐఎం బెంగళూరులో బీఎస్సీ కోర్సులు

పెరంబూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బీఎస్సీ డేటా సైన్స్, బీఎస్సీ ఎకనామిక్స్ కోర్సుల్లో చేరేందుకు నవంబరు 20వ తేది వరకు దరఖాస్తు సమర్పించాలని ఐఐఎం బెంగళూరు ఒక ప్రకటనలో తెలిపింది. బెంగళూరు ఐఐఎం 2026-27 విద్యా సంవత్సరానికి పూర్తి కాలం బీఎస్సీ డేటా సైన్స్, బీఎస్సీ ఎకనామిక్స్ కోర్సులు పరిచయం చేసింది. ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హత పరీక్ష డిసెంబరు 12వ తేది నిర్వహించనున్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఇంటర్వ్యూలు జనవరిలో నిర్వహించి, ఫిబ్రవరి 28న ఫలితాలు విడుదల చేయనున్నారు. ఈ కోర్సుల్లో చేరేందుకు 10వ తరగతి, ప్లస్ టూ పరీక్షల్లో మ్యాథ్స్‌లో 60 శాతం మార్కులు సాధించి ఉండాలి. ఆసక్తి కలిగిన విద్యార్థులు cdn.digialm.com/EForms/ configured Html/1345/96226/Registration.html అనే వెబ్‌సైట్‌లో నవంబరు 20వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చు.

5,233మంది ఉప్పు కార్మికులకు పరిహారం

పెరంబూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రస్తుత సంవత్సరం అదనంగా 5,233 మంది ఉప్పు కార్మికులకు తలా రూ.5,000 పరిహారం అందజేశారు. రాష్ట్రంలో ఉప్పు కార్మికులకు ఏడాదికి తొమ్మిది నెలలు మాత్రమే ఉపాధి లభిస్తుంది. అందువల్ల, ప్రభుత్వం, తమిళనాడు మాన్యువల్ లేబర్స్ సోషల్ సెక్యూరిటీ అండ్ వెల్ఫేర్ బోర్డులో నమోదైన ఉప్పు కార్మికుల కుటుంబాలకు అక్టోబరు నుంచి డిసెంబరు వరకు వర్షాకాలంలో నెలకు రూ.5,000 పరిహారం అందించే పథకం 2021-22 నుంచి ప్రారంభించింది. గత ఏడాది 32,611 మంది కార్మికుల కుటుంబాలకు రూ.16.32 కోట్లు పరిహారంగా అందజేశారు. ఈ ఏడాది అదనంగా 5,233 మంది కార్మికులకు తలా రూ.5,000 నగదు, రాష్ట్ర ప్రభుత్వ ఉప్పు కర్మాగారాల్లో పనిచేసే 600 మంది తాత్కాలిక కార్మికులకు తలా రూ.5,000 నివారణ అందించినట్లు, ఈ కారణంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.8.28 కోట్లు అదనంగా ఖర్చు చేసిందని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

మేట్టూరు డ్యాంకు పెరిగిన ఇన్‌ఫ్లో

పెరంబూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కావేరి నది పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా సేలం జిల్లా మేట్టూరు డ్యాంకు నీటి రాక పెరిగింది. శనివారం డ్యాంకు 9,026 ఘనపుటడుగుల మేర వస్తున్న నీరు, ఆదివారం ఉదయం 10,374 ఘనపుటడుగులకు పెరిగింది. డెల్టా జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో, డ్యాం ద్వారా విడుదల చేస్తున్న సాగు జలాలను 1,500 ఘనపుడుగులకు తగ్గించారు. ప్రస్తుతం డ్యాంలో 119 అడుగులు (పూర్తి సామర్థ్యం 120 అడుగులు) చొప్పున 91.88 టీఎంసీల నీటినిల్వలున్నాయని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

వృద్ధులకు దీపావళి కానుక

వేలూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వెలుగుల పండుగ దీపావళిని పురస్కరించుకుని వేలూరు జిల్లా అన్నైకట్టు పొయిగై పంచాయతీలోవున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం దీపావళి కానుకల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి చేతుల మీదుగా వృద్ధులందరికీ కానుకలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తున్నట్లు, ఈ సందర్భంగా వృద్ధాశ్రమం నిర్వాహకులకు, జిల్లా ప్రజలకు ఆమె దీపావళి శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సెంథిల్‌కుమార్, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్, కార్యదర్శి పాండియన్, నిర్వాహకుడు ఇంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలికి దీపావళి కానుక అందజేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

అన్నాడీఎంకే హయాంలోనే అభివృద్ధి: నటి గౌతమి

ప్యారీస్, అక్టోబరు 19 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రాన్ని సుమారు 30యేళ్లకు పైగా పరిపాలించిన అన్నాడీఎంకే వల్లే అభివృద్ధి సాధ్యమైందని ఆ పార్టీ ప్రచార విభాగం రాష్ట్ర డిప్యూటీ కార్యదర్శి, ప్రముఖ సినీనటి గౌతమి పేర్కొన్నారు. ఉత్తర చెన్నై తూర్పు జిల్లా అన్నాడీఎంకే కార్యదర్శి ఆర్ ఎస్ రాజేష్ అధ్యక్షతన శనివారం రాత్రి ఆర్కేనగర్‌లో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ, చెత్తపై విధించిన పన్ను ఉపసంహరించుకోవాలని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ)ని డిమాండ్ చేశారు. అనంతరం ఆయన ప్రచార కర్త నటి గౌతమితో కలిసి 800 మంది పేదలకు దీపావళి కానుకను పంపిణీ చేశారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న నటి గౌతమి

బ్రాందీ ప్యాకెట్లను తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

వేలూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా పేర్నాంబట్టు ప్రాంతంలో బ్రాందీ ప్యాకెట్లను తరలిస్తున్న ఇద్దరి యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. గత కొద్దిరోజులుగా ఆ ప్రాంతంలో గంజాయి, గుట్కా తదితర మత్తుపదార్థాలను అక్రమ రవాణా జరుగుతుందనే సమాచారంతో జిల్లా ఎస్పీ మయిల్‌వాహనం నేతృత్వంలోని పోలీసుల బృందం ఆ ప్రాంతాల్లో నిఘా ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి సమయంలో పేర్నాంబట్టు కొండప్రాంతంలో ద్విచక్రవాహనంపై వస్తున్న ఇద్దరు యువకులను ఆపి తనిఖీ చేయగా, వారిదగ్గరున్న సంచిలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన 1,330 బ్రాందీ ప్యాకెట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుని ఇద్దరు యువకులను అరెస్ట్ చేశారు. విచారణలో వారు కోట్టైకాలనీకి చెందిన పులిఅరసన్, జేజేనగర్‌కు చెందిన జవరసన్‌గా పోలీసులు గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసి వేలూరు కోర్టులో హాజరుపరిచిన అనంతరం రిమాండ్‌కు తరలించారు.

కానిస్టేబుల్‌పై చేయి చేసుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేపై కేసు

ప్యారీస్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నాసాలైలో విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ విభాగం కానిస్టేబుల్‌పై చేయిచేసుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎస్.రాజ్ కుమార్‌పై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. అన్నాసాలైలో ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ చేసిన కారును అక్కడినుంచి తరలించాలని ట్రాఫిక్ కానిస్టేబుల్ ప్రభాకరన్ కోరగా నిరాకరించిన మైలాడుదురై ఎమ్మెల్యే రాజ్‌కుమార్ ఆయనపై చేయి చేసుకున్నారు. అంతటితో ఊరుకోకుండా తన కారు ముందు చక్రానికి తాళం వేయడంతో ఎమ్మెల్యే తనను అసభ్యకరమైన పదజాలంతో దూషించినట్లు ప్రభాకరన్ అన్నాసాలై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యేపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు.



కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎస్.రాజ్‌కుమార్

● కరూర్ దుర్ఘటన ... కారు దిగకుండానే సీబీఐ అధికారుల విచారణ

అడయార్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కరూర్ తొక్కిసలాటలో 41 మంది మృత్యువాతపడిన దుర్ఘటనపై సీబీఐ అధికారులు విచారణ ప్రారంభించారు. అయితే, తొక్కిసలాట జరిగిన ప్రాంతానికి వెళ్ళిన సీబీఐ అధికారులు కారు దిగకుండానే తూతూ మంత్రంగా పరిశీలించి వెళ్లిపోయారు. శనివారం సాయంత్రం ఘటనా స్థలానికి చేరుకున్న సీబీఐ అధికారులు కారు నుంచి కిందకు దిగకుండానే కారులో కూర్చొనే తొక్కిసలాట జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ అధికారులో త్వరలోనే బాధితులను పిలిచి విచారించనున్నారు. ఇదిలావుంటే, ఈ తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన 41 కుటుంబాలకు రూ.20 లక్షలు చొప్పున పరిహారాన్ని టీవీకే అధ్యక్షుడు విజయ్ ప్రకటించగా, అందులో 39 మంది కుటుంబాలకు ఈ ఆర్థిక సాయాన్ని అందజేశారు. మరో ఇద్దరు మృతుల కుటుంబాల అంతర్గత సమస్యల కారణంగా ఈ పరిహారాన్ని టీవీకే నేతలు అందజేయలేదు.

దీపావళి వేడుకలకు దూరంగా....

దీపావళి వేడులకు దూరంగా ఉండాలని టీవీకే శ్రేణులకు పార్టీ అధ్యక్షుడు విజయ్ పిలుపునిచ్చారు. ఇది విమర్శలకు తావిచ్చింది. గత నెలలో జరిగిన విజయదశమి వేడుకలను టీవీకే నేతలు ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో భాగంగా, పనైయూరులోని టీవీకే కార్యాలయంలో విజయ్ ప్రచార వాహనం, తన కార్లకు ప్రత్యేక పూజలు చేశారు. కరూర్‌లో తొక్కిసలాట జరిగిన నాలుగు రోజులకే టీవీకే నేతలు ఆయుధపూజ వేడుకల్లో పాల్గొనడం చర్చకు దారితీసింది. ఈ కారణంగానే ఇపుడు దీపావళి వేడుకలను జరుపుకోరాదని విజయ్ పిలుపునిచ్చారు.

వంట పాత్రలో చిక్కుకున్న బాలిక తల

● చాకచక్యంగా తొలగించిన అగ్నిమాపక సిబ్బంది

పెరంబూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలో రెండున్నరేళ్ల బాలిక తలపై చిక్కుకున్న పాత్రను అగ్నిమాపక సిబ్బంది చాకచక్యంగా తొలగించారు. పెరంబూర్ సమీపంలో నివసిస్తున్న లక్ష్మీ-రమేష్ దంపతుల రెండున్నరేళ్ల కుమార్తె తల అల్యూమినియం పాత్రలో చిక్కుకుపోయింది. పాత్ర తీసేందుకు తల్లిదండ్రులు, చుట్టుపక్కల వారు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో తల్లిదండ్రులు పెరంబూర్ సెంబియం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని అల్యూమినియం పాత్రను కట్ చేసి, బాలిక తలను విడిపించారు.



బాలిక తల నుంచి పాత్రను తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది



మార్కెట్లలో సందడి
జోరుగా బాణసంచా అమ్మకాలు

దీపావళి పండుగ అంటే ఆబాలగోపాలం ఎంతో ఇష్టపడతారు. పండుగ రోజు లక్ష్మీపూజ చేయడం, భవిష్యత్తులో అంతా మంచే జరగాలని ప్రజలు కోరుకుంటారు. అమ్మవారు నరకాసురుడిని వధించిన అనంతరం ప్రజలు సంతోషంతో టపాసులు కాల్చడం ద్వారా మరింత ఆనందం పెరిగింది. దీపావళి నేపథ్యంలో, రాజధాని నగరంలో పండుగ రద్దీ దృష్ట్యా రాష్ట్రపర్యాటక అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో మెరీనా బీచ్‌రోడ్డులో ఉన్న ఐలాండ్ గ్రౌండులో టపాసుల విక్రయాల కోసం కేటాయించిన స్థలంలో వందకు పైగా దుకాణాల్లో బాణసంచా విక్రయాలు జోరందుకున్నాయి. పండుగ వేళ ఇళ్లు, కార్యాలయాలను మరింత అందంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆదివారం మార్కెట్లకు తరలివెళ్లారు. అదేవిధంగా దీపాలకోసం ఈసారి కూడా వివిధ డిజైన్లలో అందుబాటులోకి వచ్చిన మట్టి ప్రమిదలను మహిళలు ఆసక్తిగా కొనుగోలు చేస్తున్నారు.

– ప్యారీస్, ఆంధ్రజ్యోతి











ఐలాండ్ గ్రౌండ్‌లో ఏర్పాటైన స్టాల్స్‌లో జోరుగా సాగుతున్న బాణసంచా అమ్మకాలు



తారాజువ్వలతో పోటీపడిన ధరలు...

దీపావళి పండుగను పురస్కరించుకుని పూలధరలు మూడింతలు పెరిగాయి. మదురై హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో మల్లెపూలు ఆదివారం రూ.2వేలకు విక్రయించారు. అదేవిధంగా కనకాంబరం రూ.1,500, మకరందం రూ.600, గులాబీ రకాలు రూ.200 నుంచి రూ.350వరకు కిలో చొప్పున విక్రయించారు. బంతి, చామంతి, సంపంగి, మనోరంజని తదితర పూలధరలు కూడా స్వల్పంగా పెరిగాయి. టెంకాయలు, కొబ్బరిబోండాలు, అరటి, కొబ్బరి తోరణాలు తదితర పూజాసామగ్రి ధర కూడా మూడింతలు పెంచారు.

విన్గో పేజెస్ మొబైల్ యాప్ ఆవిష్కరణ

చెన్నై, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారుల రోజువారీ అవసరాలను సులభతరం చేస్తూ స్థానిక వ్యాపారాలను ప్రోత్సహించేలా 'విన్గో పేజెస్' పేరుతో రూపొందించిన కొత్త మొబైల్ యాప్‌ను నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రముఖ సినీనటి మృణాళిని రవి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం విన్గో పేజెస్ ఇండియా సీఈఓ రీనా జోసెఫ్, వ్యవస్థాపకుల సహాయాధికారి శ్వేతా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రీనా జోసెఫ్ మాట్లాడుతూ విన్గో పేజెస్ దేశంలో కొత్తగా రూపొందించిన స్టార్టప్ అని, ఇది కమ్యూనిటీ బిజినెస్ డైరెక్టరీ ప్లాట్‌ఫామ్‌గా పనిచేస్తుందని తెలిపారు.



కొత్త యాప్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న నటి మృణాళిని, సంస్థ నిర్వాహకులు

తిరుచెందూరులో వెనక్కి మళ్ళిన సముద్రం

చెన్నై, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : తిరుచెందూరు సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వెనుకనున్న సముద్రతీరం ఆదివారం వేకువజాము ఉన్నట్టు వందడుగుల మేర వెనక్కి మళ్ళింది. దీంతో తీరంలో నాచుతో కూడిన బండరాళ్లు బయటపడ్డాయి. ఈ సముద్రతీరం వద్ద అమావాస్య, పౌర్ణమి దినాల్లో సముద్రం వెనక్కివెళ్ళటం ఆనవాయితీ. అమావాస్య రాకుండానే ఆదివారం సముద్రం వెనక్కి మళ్ళటం భక్తులకు ఆందోళన కలిగించింది. నాళికినరు ప్రాంతం నుండి అయ్యా కోవిల్ దాకా సుమారు 500 మీటర్ల దాకా సముద్రం వెనక్కి మళ్ళింది.



తిరుచెందూరు సముద్రతీరం వద్ద వెనక్కి మళ్ళిన సముద్రం

విరాలిమలైలో 22 నుంచి స్కందషష్ఠి వేడుకలు

చెన్నై, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లా విరాలిమలైలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఈ నెల 22న ధ్వజారోహణంతో స్కందషష్ఠి వేడుకలు ప్రారంభమవుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. గణపతి హోమం తర్వాత ఆ రోజు ఉదయం 10.30 గంటలకు ధ్వజారోహణంజరుగుతుందని పేర్కొన్నారు. ఆ తర్వాత రోజూ ఉదయం, సాయంత్రం స్వామివారు ఇష్టదేవేరుల సమేతుడై, సింహ, భూత, నాగ, మయూర వాహనాల్లో ఊరేగనున్నారు. 27 సాయంత్రం శూరసంహార వేడుకలు జరుగుతాయని, 28 స్వామివారి కల్యాణోత్సవం 30న ధ్వజావరోహణంతో ఈ ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

విరాలిమలై మురుగన్ ఆలయం



నారాయణి అమ్మవారి సేవలో నటుడు ప్రభు



సినీ నటుడు ప్రభుతో ఆలయ నిర్వాహకులు

వేలూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వేలూరులో ప్రసిద్ధి చెందిన శ్రీపురం నారాయణి పీఠం స్వర్ణాలయాన్ని ఆదివారం ఉదయం సినీ నటుడు ప్రభు సందర్శించారు. ఆలయ మర్యాదలతో ఆయనకు స్వర్ణాలయం ట్రస్టీ డా.సురేష్ బాబు ఆయనకు ఘన స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. ఈ సందర్భంగా ప్రభు మాట్లాడుతూ, గత కొద్దిరోజులుగా అమ్మవారి దర్శనం కోసం స్వర్ణాలయానికి రావలనుకున్నానని, ఈరోజు అమ్మవారి దర్శనభాగ్యం కలిగిందన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ప్రసాదం పంపిణీ చేసి ఘనంగా సత్కరించారు.

మేల్‌మరువత్తూరులో వైభవంగా గురుపూజ



అడిగలార్ విగ్రహానికి హారతిస్తున్న నిర్వాహకులు

ప్యారీస్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా మేల్‌మరువత్తూరులోని ఆదిపరాశక్తి పీఠంలో ఆదివారం గురుపూజ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి గర్భగుడిలో విశేషపూజానంతరం పీఠాధిపతి దివంగత బంగారు అడిగలార్ ద్వితీయ వార్షిక గురుపూజ సందర్భంగా ఆయన విగ్రహానికి హారతులిచ్చారు. ఈ వేడుకలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణం, పరిసరాలను మామిడి, అరటితోరణాలు, ఎరుపురంగు జెండాలతో అలంకరించారు. శనివారం సాయంత్రం కలశస్థాపన, జ్యోతిప్రజ్వలనలతో రెండ్రోజుల గురుపూజా కార్యక్రమాలను పీఠాపతి లక్ష్మి బంగారు అడిగలార్ ప్రారంభించారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మహాఅన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అన్బళగన్, సెంథిల్ కుమార్, శ్రీదేవి రమేష్, ఉమాదేవి జయగణేష్, రాణిపేట జిల్లా న్యాయమూర్తి సెల్వం సహా కరూర్, శివగంగ, పుదుకోట, రామనాథపురం తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఆస్ట్రేలియా జలవనరుల బృందం పర్యటన



నగరంలో ఓ ప్రముఖ కర్మాగారంలో పరిశీలిస్తున్న ఆస్ట్రేలియా జలవనరుల బృందం సభ్యులు

చెన్నై, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నీటి వనరుల పెంపునకు చేపట్టాల్సిన చర్యలపై ప్రముఖ వాణిజ్య సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకునే దిశగా ఆస్ట్రేలియాకు చెందిన ఆరుగురు సభ్యుల జలవనరుల ప్రతినిధుల బృందం నగరంలో పర్యటించింది. ఆస్ట్రేలియా, భారత్ నీటివనరుల నిపుణుల మార్పిడి కార్యక్రమంలో ఆస్ట్రేలియా ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిషన్ ఆధ్వర్యంలో ఈ పర్యటన నిర్వహించింది. జల వనరుల అభివృద్ధి, సంస్కరణలో తమ విస్తృత అనుభవాలను పంచుకోవడానికి దక్షిణ ఆస్ట్రేలియా జలవనరుల రాయబారి కార్లీన్ మేవాల్డ్ నాయకత్వంలో ఈ బృందం సభ్యులు నగరానికి వచ్చి ప్రముఖ కంపెనీలలో ఈ బృందం పర్యటించింది.



క్యూలైన్‌లో వేచివున్న భక్తులు

అరుణాచలేశ్వరాలయంలో భక్తుల రద్దీ

ప్యారీస్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ నేపథ్యంలో తిరువణ్ణామలైకు భక్తులు పెత్తసంఖ్యలో పోటెత్తారు. పండుగ సందర్భంగా శనివారం నుంచి సెలవులు ప్రకటించడంతో ఈ క్షేత్రానికి సాధారణ రోజుల కంటే ఆదివారం రికార్డు స్థాయిలో భక్తులు వచ్చారు. క్యూలైన్లలో సుమారు 3గంటలకు పైగా వేచివుండి ఉన్నామలై సమేత అన్నామలైయార్‌ను భక్తులు దర్శించుకున్నారు. రాజగోపురం మార్గం, అమ్మవారి గోపురమార్గాల్లో భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉచిత దర్శనం మార్గంలో భక్తులకు మంచినీరు, మజ్జిగ తదితరాలను పంపిణీ చేశారు. మరోవైపు గిరిప్రదక్షిణ పూర్తిచేసుకున్న భక్తులు స్వామివార్లను సేవించారు. మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు ఆలయ నిర్వాహకులు ఉచిత అన్నప్రసాద పంపిణీ చేశారు.

కాశిమేడు మార్కెట్‌కు పోటెత్తిన జనం



చేపల మార్కెట్ వద్ద రద్దీ

చెన్నై, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పురటాసి మాసం పూర్తయిన తర్వాత వచ్చిన మొదటి ఆదివారం సందర్భంగా వేలాది మంది నగరవాసులు వేకువజామునే కాశిమేడు చేపల మార్కెట్‌కు చేరుకున్నరు. నెలరోజులపాటు మాంసాహారం ముట్టుకోని వారంతా ఒక్కసారిగా వెళ్లటంతో ఆ ప్రాంతంలో విపరీతమైన రద్దీ ఏర్పడింది. తాజా చేపలను పోటీపడి వేలంపాడి బుట్టలతోనే ఇళ్ళకుతిరిగి వెళ్ళారు. వంజిరం, వవ్వాల్, పాల్ సురా, తిరుక్కై, పారై, సీలా, శంకరా రకానికి చెందిన పెద్ద చేపల కొనుగోళ్లకు జనం పోటీపడింది. వేకువజాము మూడు గంటల నుండి నగరం నలుమూలల నుంచి వాహనాల్లో వచ్చిన నగరవాసులు తాజా చేపలను కొనేందుకు బారులు తీరారు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటల దాకా ఈ చేపల అమ్మకాలు జోరుగా సాగాయి. ఇదే విధంగా చింతాద్రిపేట చేపల మార్కెట్, ఐస్‌హౌస్ చేపల మార్కెట్, రాయపేట మీర్‌సాహెబ్ మార్కెట్లలో చేపలు కొనేందుకు వచ్చిన జనాలతో కిటకిటలాడాయి.

జీవితంలో ముందుకు

సాగాలంటే ధైర్యం ముఖ్యం



● మంత్రి సీవీ గణేశన్

'టీఎంజేఏ' సావనీర్ విడుదల దృశ్యం

జీవితంలో ముందుకు సాగాలంటే ఎంతో ధైర్యం ఉండాలని కార్మిక సంక్షేమ శాఖ మంత్రి సీవీ గణేశన్ అన్నారు. తమిళ మూవీ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీఎంజేఏ) ఆధ్వర్యంలో దీపావళి వేడుకలు, సావనీర్ రిలీజ్ కార్యక్రమం నగరంలో జరిగింది. ఇందులో రాష్ట్ర మంత్రి సీవీ గణేశన్‌తో పాటు నడిగర్ సంఘం ఉపాధ్యక్షుడు పూచ్చి మురుగన్, జాతీయ అవార్డు గ్రహీత, నటుడు ఎంఎస్ భాస్కర్, సీనియర్ సినీ నటి రేఖ, ఆవడి ఏసీపీ ఎన్.ఇలంగోవన్, టీఎంజేఏ నిర్వాహకులు, కార్యవర్గం సభ్యులంతా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీవీ గణేశన్ మాట్లాడుతూ తనకు పూచ్చి మురుగన్‌కు 35 యేళ్ళ అనుబంధం ఉందన్నారు. ఆయన అనుమతి లేనిదే డీఎంకే ప్రధాన కార్యాలయమైన అరివాలయంలోకి ఎవరూ ప్రవేశించలేరన్నారు. తన చిన్ననాటి దీపావళికి ఇప్పటి దీపావళికి ఎంతో తేడా ఉందని మంత్రి గణేశన్ అన్నారు. సినీ నటి రేఖా మాట్లాడుతూ, అనేక సినిమాల్లో నటించినా, మంచి పాత్రలను పోషించినప్పటికీ అపుడపుడూ పత్రికల్లో వచ్చే వార్తల రూపంలో వాటిని గుర్తు చేస్తూ ఉంటాయన్నారు. జాతీయ అవార్డు గ్రహీత నటుడు ఎంఎస్ భాస్కర్ మాట్లాడుతూ, ఇతరుల మనసులను నొప్పించకుండా వార్తలను ప్రచురించాలన్నారు. సాధారణ నటుడు స్థాయి నుంచి జాతీయ అవార్డు స్థాయికి తీసుకొచ్చింది మీడియానే అని ఆయన పేర్కొన్నారు. ఆ తర్వాత నడిగర్ సంఘం ఉపాధ్యక్షుడు పూచ్చి మురుగన్, ఏసీపీ ఇలంగోవన్, టీఎంజేఏ అధ్యక్షురాలు ఎస్.కవిత, ప్రధాన కార్యదర్శి కోడంగి, కోశాధికారి ఒట్రన్ దురై తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా టీఎంజేఏ సావనీర్‌ను మంత్రి గణేశన్ విడుదల చేశారు.

చిత్రజ్యోతి

7న 'పగల్ కనవు' విడుదల



'పగల్ కనవు'లో ఓ దృశ్యం

ఫైజల్ రాజ్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'పగల్ కనవు'. నవంబరు ఏడో తేదీ విడుదలకానుంది. తమిళం, తెలుగు, మలయాళ భాషల్లో రూపుదిద్దుకుంది. ఈ సినిమాకు స్టోరీ, స్క్రీన్‌ప్లే సమకూర్చి దర్శకత్వం వహించిన ఫైజల్ రాజ్... సినిమా సొంతంగా నిర్మించారు. ఇతర పాత్రల్లో కూల్ సురేష్, సీనియర్ నటి షకీలా, కరాటే రాజా తదితరులు నటించారు. ఫైజల్ రాజ్ కేరళలో పుట్టి పెరిగినప్పటికీ బాల్యం నుంచి సినిమా ప్రేమికుడు. అందుకే తన స్వీయ నిర్మాణంలో ఈ చిత్రాన్ని నిర్మించి, హీరోగా కూడా నటించారు. సెవెన్ స్టూడియోస్ కన్నన్ సినిమా రాష్ట్ర వ్యాప్తంగా విడుదల చేయనున్నారు. ఇప్పటికే సెన్సార్ పనులు పూర్తి చేసుకోగా ఈ చిత్రానికి 'యూఏ' సర్టిఫికెట్ లభించింది.

సస్పెన్స్ థ్రిల్లర్‌గా 'రూమ్ బాయ్'



'రూమ్ బాయ్'లో ఓ దృశ్యం

ఇన్వెస్టిగేషన్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా 'రూమ్ బాయ్' అనే చిత్రం రూపొందుతోంది. ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థి జగన్ రాయన్ ఈ చిత్రానికి దర్శకుడు. ఏసీఎం సినిమాస్ పతాకంపై సూర్యకళ చంద్రమూర్తి భారీ హంగులతో నిర్మిస్తున్నారు. సి.నిఖిల్ అనే యువకుడు ఈ చిత్రం ద్వారా హీరోగా పరిచయమవుతున్నారు. 'అరణ్మనై-4' మూవీలో కీలక పాత్ర పోషించిన హర్షా కథానాయికగా నటిస్తోంది. ఇమాన్ అన్నాచ్చి, బిర్లా బోస్, యూట్యూబ్ ఫేం కాత్తు కరుప్పు, సాధన, ఇన్‌స్టా ఫేం కర్పగం, సమీర్, సిటి రాజా, అరుణ్ రాజా ప్రభాకర్ వివిధ పాత్రలు పోషిస్తున్నారు. ముంబై మోడల్ బ్యూటీ నిధి మరోలి ఈ మూవీలో ఓ ఐటమ్ సాంగ్‌లో నటించనున్నారు. కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలతో పాటు దర్శకత్వ బాధ్యతలను జగన్ రాయన్ చేపట్టారు. చెన్నై ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ఈ విద్యార్థి 2002లో 'తాత' అనే షార్ట్‌ఫిల్మ్ తెరకెక్కించగా, ఉత్తమ సౌండ్ రికార్డింగ్ విభాగంలో రాష్ట్ర ప్రభుత్వ అవార్డు దక్కించుకుంది. ఈ సినిమా విశేషాలను దర్శకుడు వివరిస్తూ, 'ఫ్యామిలీ సెంటిమెంట్స్, సస్పెన్స్ థ్రిల్లర్ కోణంలో ఈ సినిమాను రూపొందిస్తున్నాం. తిరుపత్తూరు, ఏలగిరి తదితర పరిసర ప్రాంతాల్లో షూటింగ్ చేశాం. డిసెంబరులో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం. ఫస్ట్‌లుక్‌ను ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి, సెకండ్ లుక్‌ను ప్రముఖ దర్శకుడు ప్రేమ్ కుమార్ రిలీజ్ చేయగా, మంచి స్పందన వచ్చింది' అని పేర్కొన్నారు.

19మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం కారణంగా గడిచిన 24 గంటల్లో చిత్తూరు జిల్లావ్యాప్తంగా 19 మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా చౌడేపల్లెలో 56, అత్యల్పంగా చిత్తూరు అర్బన్‌లో 0.4 మి.మీ వర్షం కురిసింది. మండలాల వారీగా సోమలలో 9.2, పుంగనూరులో 34.6, ఐరాలలో 12.8, గుడిపాలలో 10, తవణంపల్లెలో 9.8, కార్వేటినగరంలో 9.4, సదుంలో 8.2, రొంపిచెర్లలో 7.2, పులిచెర్లలో 7, ఎస్‌ఆర్‌పురంలో 6.2, పెద్దపంజాణి, గంగవరంలో 5.8, కుప్పంలో 5.4, పెనుమూరులో 3.2, గుడుపల్లెలో 2.6, చిత్తూరు రూరల్‌లో 1.6, వీకోటలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

బంగారుపాళ్యం, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): పిల్లలు పుట్టలేదని మనస్తాపంతో ఓ వివాహిత బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలంలోని వెలుతురుచేను పంచాయతీ శ్రీనివాసపురంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. శ్రీనివాసపురానికి చెందిన ప్రకాష్‌కు గుడియాత్తం తాలూకా తట్టపారకు చెందిన రాజశ్రీతో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. ఈ నేపథ్యంలో పిల్లలు కలగలేదని మనస్తాపంతో శనివారం ఇంటిలో నుంచి వెళ్లిపోయింది. దీంతో బంధువులు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో ఆదివారం మధ్యాహ్నం పులిమడుగు సమీపంలోని మునిక్రిష్ణయ్య బావిలో రాజశ్రీ(20) మృతదేహం లభ్యమైంది. బంగారుపాళ్యం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు.

చంద్రబాబుకు ఉపాధ్యాయుల పాలాభిషేకం



కుప్పం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక డీఏను ప్రకటించిన నేపథ్యంలో కుప్పం నియోజకవర్గ ఉపాధ్యాయులు ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. స్థానిక మండల సచివాలయం ఆవరణలో ఆదివారం నియోజకవర్గ ఉపాధ్యాయులు సమావేశమయ్యారు. చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల ఆవేదనను అర్థం చేసుకొని ఒక డీఏను ప్రకటించినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. మిగిలిన డీఏలను విడుదల చేయడంతోపాటు పలు డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కేశవులు, రాజేశ్వర కుమార్, శ్రీరాములు, సురేంద్ర బాబు, నారాయణ స్వామి, సురేశ్, రామచంద్ర, రామ సుబ్రహ్మణ్యం, భాస్కర్, గణపతి, తులసీదాసు, ఆనంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పీహెచ్‌సీ వైద్యుల ధర్నా



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

చిత్తూరు రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీ వైద్యుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఆదివారం చిత్తూరు డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట పీహెచ్‌సీ వైద్యులు ధర్నా నిర్వహిస్తున్నారు. వైద్యులు మాట్లాడుతూ గత 19 రోజులుగా విధులు మానేసి ధర్నా చేస్తున్నా ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ న్యాయమైన కోరికలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న పీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.

ఎన్‌డీఏ ప్రభుత్వంతోనే ప్రజలకు మేలు

- ప్రభుత్వ విప్ థామస్



జీఎస్టీ ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ థామస్

చిత్తూరు అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దేశంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ప్రజలకు మేలు కలిగించే పలు కార్యక్రమాలను చేపడుతున్నామని, ఇందులో వన్ నేషన్- వన్ ట్యాక్స్ అమలు అనేది చారిత్రాత్మక నిర్ణయమని ప్రభుత్వ విప్, జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్ చెప్పారు. ఆదివారం సూపర్ జీఎస్టీ-సూపర్ తగ్గింపుపై జిల్లాలోని అన్ని శాఖల ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే భవన్‌లో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ 2.0 ద్వారా పన్నులను తగ్గించిందని చెప్పారు. జీఎస్టీ వల్ల జరిగే మేలును జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి దాదాపు ఏడాదికి రూ.18 నుంచి రూ.20వేల మేర ఆదా అవుతుందన్నారు. అనంతరం జ్యోతిరావు పూలే భవనంలో ఏర్పాటు చేసిన 36 స్టాళ్లను ప్రజా ప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. ఈ సమావేశంలో డీఆర్వో మోహన్ కుమార్, నగర మేయర్ అముద, చుడా చైర్మన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దీపావళి పండగ ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలి

చిత్తూరు అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను ప్రతి కుటుంబం సంతోషంగా జరుపుకోవాలని చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. భద్రతా నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా జరుపుకోవాలన్నారు.రోడ్లపై ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాద నివారణ చర్యల ద్వారా ప్రజలకు సహకరించడానికి పోలీసులు 24 గంటలూ అందుబాటులో ఉంటారన్నారు.



ఎస్పీ తుషార్ డూడీ

థియేటర్‌లో సీట్లకోసం.....

చిత్తూరు రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని శ్రీ వెంకటేశ్వర థియేటర్ వద్ద ఆదివారం రాత్రి వాగ్వాదం చోటుచేసుకుంది.నగరానికి చెందిన ఓ కుటుంబం సెకండ్ షోకు వచ్చింది. టికెట్ కౌంటర్ వద్ద కుటుంబంతో వచ్చాను పలానా సీట్లు కావాలని ఆ ఇంటి యజమాని కోరాడు. అందుకు సరే అన్న టికెట్లు ఇచ్చే వ్యక్తి ఫోన్‌పే ద్వారా డబ్బులు చెల్లించమన్నాడు. తీరా డబ్బులు పంపించాక వేరే సీట్లు కేటాయిస్తానని చెప్పడంతో ఆ ప్రేక్షకుడు తన డబ్బులు వెనక్కివ్వాలని కోరాడు. దీనికి టికెట్లు ఇచ్చే వ్యక్తి ఆ టికెట్లు తీసుకోవాల్సిందేనని దురుసుగా ప్రవర్తించాడు. థియేటర్ నిర్వాహకుడు కూడా తీసుకుంటే ఆ టికెట్ తీసుకో... లేకుంటే బయటకు వెళ్లు అనడంతో ఆ ప్రేక్షకుడు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు వచ్చి టికెట్ల డబ్బులు వెనక్కి ఇప్పించారు.

ఎస్వీఎంసీలో పారా మెడికల్ కోర్సులకు ఇంటర్వ్యూలు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్య కళాశాలలోని పలు డిప్లమా అల్లైడ్ హెల్త్‌సైన్స్ ప్రొఫెషనల్ కౌన్సిల్, పారా మెడికల్ కోర్సులకు సంబంధించి మిగిలిన సీట్లకు ఈ నెల 21న కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రవిప్రభు తెలిపారు. డిప్లమా ఇన్ అనస్థీషియా టెక్నాలజీలో 3, డిప్లమా ఇన్ మెడికల్ లేబొరేటరీ టెక్నాలజీలో 5 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. వీటికి మంగళవారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూలకు అర్హులైన విద్యార్థులు హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు 9440879943కు సంప్రదించాలని పేర్కొన్నారు.

జలదిగ్బంధంలో గ్రామాలు..!

- కొట్టుకుపోయిన తాత్కాలిక కల్వర్టులు
- వర్షాకాలం వస్తే ప్రయాణానికి తిప్పలు



చెన్నపట్నం చెరువు మొరవ ఉధృతి

సోమల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి):చిత్తూరు జిల్లా సోమల మండలంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు పలు తాత్కాలిక కల్వర్టులు కొట్టుకుపోయాయి. పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించి జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. సోమల - నంజంపేట మార్గంలోని సరస్వతీపురం వద్ద జీడిరేవుల వంక ఉధృతంగా ప్రవ హించి రాత్రి 8 గంటలకు తాత్కా లిక కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో పెద్దఉప్పరపల్లె, నంజంపేట, ఆవులపల్లె, అన్నెమ్మగారిపల్లె, పేటూరు పంచాయతీల్లోని గ్రామాలకు ప్రజలు ఈ మార్గంలో వెళ్లలేక పోతున్నారు. నంజంపేట - పొదలకుంటపల్లె మార్గంలోని దళవాయి చెరువు వద్ద తాత్కాలిక కల్వర్టు వరదనీరు ముంచెత్తింది. దీంతో కల్వర్టు కొట్టుకుపోయింది. ఈక్రమంలో రాకపోకలు స్తంభించాయి. అలాగే చెన్నపట్నం చెరువు మొరవపై నిర్మించిన కల్వర్టు ఇటీవల కొట్టుకుపోవడంతో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆ చెరువుతోపాటు ఈ మార్గంలోని గువ్వలగుట్టను సందర్శించారు. సోమల ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు చొరవ తీసుకుని గ్రామస్థులు, దాతలు విరాళాలు సేకరించి గువ్వలగుట్ట మార్గంలో తాత్కాలిక కల్వర్టును ఏర్పాటు చేశారు. వారం లోపే శనివారం రాత్రి కురిసిన వర్షాలకు చెన్నపట్నం చెరువు మొరవ ఉధృతి పెరిగి కల్వర్టుకు గండి పడి కొట్టుకు పోయింది. దీంతో గువ్వలగుట్ట మార్గంలో రాకపోకలు స్తంభించాయి. ఆవులపల్లె - పెద్దఉప్పరపల్లె మార్గంలోని సీతమ్మ చెరువు మొరవనీరు ఉధృతంగా ప్రవహించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గార్గేయనది ఉధృతంగా ప్రవహించడంతో రెడ్డివారిపల్లె, పేటూరు, బసవపల్లె, బోనమందలకు రాకపోకలు లేక జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఏళ్లు గడుస్తున్నా గార్గేయ అలాగే నదిపై వంతెనల నిర్మాణం నోచుకోకపోవడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. వర్షాకాలం వస్తే ప్రయాణాలు గగనంగా మారుతున్నాయి. పెద్దఉప్పరపల్లె వద్ద గార్గేయనది ప్రవహించడంతో అటు వైపున ఉన్న రెడ్డివారిపల్లె, బోనమంద, దుర్గంకొండ ఆలయానికి, పేటూరు, బసవపల్లె, చిన్నకమ్మపల్లె, చిన్నతోపు, పొలికిమాకులపల్లె తదితర గ్రామాల ప్రజలు పెద్దఉప్పరపల్లెకు వచ్చి నిత్యావసర వస్తువులు తెచ్చుకోలేక పోతున్నారు. వైద్య సేవలు పొందలేక పోతున్నారు. భారీ వర్షాలతో తాత్కాలిక కల్వర్టు కొట్టుకుపోయి 7 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ప్రజలు వరదనీటిలో ప్రయాణం చేయక తప్పడం లేదు. గతంలో ప్రజాప్రతినిధులు, అధికారులకు పలుమార్లు సమస్యను మొరపెట్టుకున్నా స్పందన కరవైంది. ఇప్పటికైనా వంతెనలు నిర్మించి ప్రజల కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.



జీడిరేవుల వంకపై కొట్టుకుపోయిన కల్వరు, వంక ఉధృతిని పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్



చెన్నపట్నం చెరువు మొరవపై కల్వర్టుకు గండి



నంజంపేట-పొదలగుంట్లపల్లె మార్గంలో గండిపడ్డ దళవాయి చెరువు

జూపల్లిలో గజరాజుల దాడులు

కల్లూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. మండలంలోని పాళెం పంచాయతీలో శనివారం రాత్రి ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేయడంతో అపారనష్టం వాటిల్లింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని బోదబండ నుంచి శనివారం రాత్రి బయలుదేరిన 7 ఏనుగుల గుంపు అటవీ సరిహద్దులో ఉన్న పాళెం పంచాయతీ జూపల్లి వద్దకు చేరుకున్నాయి. గ్రామంలోని రైతులు శివయ్య, రఘు, జయపాల్, మునస్వామి, మోహన్, సుబ్బరత్నకు చెందిన మామిడిచెట్ల కొమ్మలను ఏనుగుల గుంపు పూర్తిగా విరిచేశాయి. కొబ్బరిచెట్లను ధ్వంసం చేశాయి. పశుగ్రాసాన్ని తినేశాయి. పంటలను ధ్వంసం చేస్తున్న ఏనుగుల గుంపును గమనించిన గ్రామస్తులు టపాకాయలు పేల్చారు. టపాకాయలు శబ్దాలు వినడంతో ఏనుగుల గుంపు వచ్చిన మార్గంలోనే తిరిగి అడవిలోకి వెళ్లిపోయాయి. ఆదివారం పగలంతా అడవిలోని సూరప్పచెరువు వద్ద ఏనుగుల గుంపు తిష్ట వేసినట్లు ప్రజలు తెలిపారు. అటవీ సరిహద్దు గ్రామాలకు సమీపంలోని అడవిలో ఏనుగుల గుంపు తిష్ట వేశాయని, దీంతో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ఎస్ఎఫ్‌వో మహమ్మద్ షఫి, ఎఫ్‌బీవో మధు హెచ్చరించారు.



మామిడిచెట్టు కొమ్మలను పూర్తిగా విరిచేసిన ఏనుగులు (వృత్తంలో)

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా మురళి

చిత్తూరు రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా మురళి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా భాస్కర్, కార్యదర్శిగా షణ్ముగం, అసోసియేట్ అధ్యక్షుడిగా సంతానం, అడిషనల్ కార్యదర్శిగా వినాయక, కన్వీనర్‌గా బాబు, ఉపాధ్యక్షులుగా సుబ్రమణ్యం, ప్రసాద్, రమేష్, నవీన్, నరేష్, సుబ్బలక్ష్మి, ప్రణీత, రజిని, కవిత, సురేఖ, మాధవ ప్రసాద్, రఘుపతి, గుణశేఖర్, షణ్ముగం, అన్బురాజ్, సిద్దయ్య, కృష్ణప్రసాద్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా దేవరాజులు, మహేష్, కుమార్, ప్రవీణ్, చిరంజీవి, ప్రగతి, ప్రతిభ, చెన్నకేశవులు, కృష్ణయ్య, వెంకటరమణ, రెడ్డప్ప, చిన్నయ్య, చెంగయ్య, పురుషోత్తం, రమ్య, సులోచన, లోకనాథన్, సురేష్, చిన్నప్ప, మురగయ్య, గుణశేఖర్, రాజేష్, మొగిలయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం కార్యవర్గం చేత ప్రమాణస్వీకారం చేయించారు.



నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం

అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు

- కారును తప్పించబోయి బోల్తాపడ్డ డీజిల్ ట్యాంకర్





డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు, బోల్తాపడ్డ డీజిల్ ట్యాంకర్

బంగారుపాళ్యం, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): చెన్నై-బెంగుళూరు జాతీయ రహదారిలో ఆదివారం కారును తప్పించబోయిన డీజిల్ ట్యాంకర్ బోల్తాకొట్టింది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. బెంగళూరు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న కారు చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం సంక్రాంతిపల్లె వద్దకు చేరుకోగానే అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. అదే సమయంలో యాదమరి నుంచి డీజిల్ లోడుతో పలమనేరు వైపు వెళుతున్న ట్యాంకరు వైపు కారు దూసుకొచ్చింది. దీంతో డీజిల్ ట్యాంకర్ డ్రైవర్ ఆ కారును తప్పించబోగా బోల్తాపడింది. ఈ ప్రమాదంలో చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న చిత్తూరు అగ్నిమాపక సిబ్బంది బంగారుపాళ్యం సీఐ శ్రీనివాసులు, ఎస్సై ప్రసాద్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను మళ్లించి ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

పాలారు పరవళ్లు..!

రామకుప్పం/శాంతిపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా శాంతిపురం పట్టణానికి ఆనుకుని ప్రవహించే పాలారు నది పరవళ్లు తొక్కుతోంది. కర్ణాటక రాష్ట్రంలో కొనసాగుతున్న భారీ వర్షాలతో రాష్ట్ర సరిహద్దుల్లోని చెరువులు నిండి మొరవలు పోతున్నాయి. ఈ వరదనీరు గురువారం ఉదయం రామకుప్పం మండలం కొళ్ళుపల్లె వద్ద ప్రారంభమయ్యే పాలారు నదికి చేరుకునున్నాయి. మూడు రోజుల పాటు ప్రవహించిన జలాలు శనివారం రాత్రి శాంతిపురం పట్టణానికి చేరువలోని పాలారు చెక్‌డ్యాంకు చేరుకున్నాయి. ఆదివారం తెల్లవారుజామున చెక్‌డ్యాం నిండి జలాలు కిందికి హోరు శబ్దం చేస్తూ జాలువారుతున్నాయి. కొన్నేళ్ల తర్వాత పాలారు పరవళ్ల నియోజకవర్గ రైతుల్లో సంతోషం నింపుతోంది. కుప్పం నియోజకవర్గంలో సుమారు 38 కిలోమీటర్లు ప్రవహించే పాలారు నదీ జలాలు తమిళనాడుకు చేరుకుంటాయి. ఈ నదీ పరీవాహక ప్రాంతంలో సుమారు నాలుగేళ్లుగా వర్షాలు నామమాత్రంగా కురవడంతో భూగర్భజలాలు తగ్గిపోయి రైతులు ఇబ్బందులకు గురయ్యారు. పాలారు నది ఒకసారి ప్రవహిస్తే ఈ ప్రాంతంలో రెండేళ్లపాటు భూగర్భజలాలు పుష్కలంగా ఉంటాయి. రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



శాంతిపురం వద్ద నిండుజలాలతో పాలారు చెక్‌డ్యాం



పాలారు చెక్‌డ్యాం నుంచి జలప్రవాహం

థ్యాంక్యూ సార్...ప్రభుత్వ బహుమతి అందింది

తిరుపతి(క్రీడలు), అకోబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక మహిళా వర్సిటీ సమీపంలోని గాయత్రినగర్‌కు చెందిన దండు పూజ 2023 అక్టోబరులో గోవాలో జరిగిన నేషనల్ గేమ్స్‌లో షటిల్ బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ డబుల్స్‌లో బంగారు పతకం కైవసం చేసుకుంది. అలాగే టీమ్ ఉమెన్ క్యాటగిరిలో బ్రాంజ్ మెడల్ సాధించింది. ఆ మేరకు అప్పటి వైసీపీ ప్రభుత్వం ఆమెకు నగదు బహుమతి ప్రకటించింది. ఆ తర్వాత పట్టించుకోలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం క్రీడాకారులకు నగదు బహుమతులు జమ చేయడంలో భాగంగా పూజకు రూ.8లక్షలు అందింది. ఈ క్రమంలో ఆమె ఆదివారం శాప్ చైర్మన్ రవినాయుడిని మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పూజను సత్కరించారు. మరిన్ని పతకాలు సాధించి, దేశానికి, రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో శశిధర్ పాల్గొన్నారు.



పూజకు శాలువకప్పి సన్మానిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

మా భూమి కాజేశారు

- రికార్డులు తారుమారు చేసిన తహసీల్దార్
- న్యాయం చేయాలని బాధితుల వేడుకోలు



భూముల రికార్డులను చూపుతున్న బాధితులు

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : రికార్డులు తారుమారు చేసి కాజేసిన మా భూమిని ఇప్పించి న్యాయం చేయాలని బాధితులు అనసూయమ్మ, పాండురంగయ్య కోరారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వారు మాట్లాడుతూ శ్రీకాళహస్తి పిట్టలవారి సంధుకు చెందిన తాము బుచ్చినాయుడుకండ్రిగ మండలం పల్లమాల గ్రామంలో సర్వే నంబరు 79/3లో ఐదు ఎకరాల భూమిని 2011లో కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ భూమి 2012లో తమ అనుభవంలోకి రాగా 2019లో పాసుపుస్తకాలు కూడా మంజూరైనట్లు చెప్పారు. పంటల సాగు నిమిత్తం శ్రీకాళహస్తి ఇండియన్ బ్యాంకులో రుణం కూడా తీసుకున్నట్లు తెలిపారు. కొన్ని రోజులుగా పల్లమాల గ్రామానికి చెందిన శేఖర్ భూమి తమదంటూ వివాదానికి దిగడంతో కేసులు కూడా అయ్యాయని వివరించారు. కోర్టులో కేసు వేసినట్లు చెప్పారు. ఈనెల 8వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో తమ పేరుతోనున్న భూములు 10వ తేదీకి రవీంద్రబాబు పేరుమీదకు మారిపోయాయని తెలిపారు. ఇది తహసీల్దారు చేసిన కుట్ర అని ఆరోపించారు. ఈ విషయమై అడిగితే సరైన సమాధానం ఇవ్వకపోగా హైకోర్టు ఆదేశాలతో రికార్డులు మార్చినట్లు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈనెల 17వ తేదీన బీఎన్‌కండ్రిగ తహసీల్దారు కార్యాలయం వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. దీంతో తమపై కేసులు పెట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ స్పందించి, విచారణ జరిపి రికార్డులు తారుమారు చేసిన అధికారులపై చర్యలు తీసుకుని తమ భూమి ఇప్పించి న్యాయం చేయాలని, లేకపోతే ఆత్మహత్యే శరణ్యమని స్పష్టం చేశారు.

ఉద్యోగుల హామీల అమలు హర్షణీయం

తిరుపతి(వైద్యం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చడమే కాకుండా బకాయిలు చెల్లిస్తుండటం హర్షణీయమని ఏపీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు అన్నారు. తిరుపతి ఏపీఎన్జీవోస్ భవనంలో ఆదివారం ఏపీఎన్జీవోస్ నేతలతో కలిసి థ్యాంక్యూ సీఎం సార్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో డీఏ ప్రకటించకుండా, బకాయిలు చెల్లించకుండా ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేసిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించడం సంతోషకరమన్నారు. జీపీఎస్, ఏపీజీఎల్ఐ, సీపీఎస్‌లతోపాటు ఉద్యోగులకు రావాల్సిన కాంట్రిబ్యూషన్, ఉద్యోగ విరమణ చెందిన ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను కలిపి ఇప్పటికే రూ.15 వేల కోట్లు చెల్లించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిబాబు, కోశాధికారి శ్రీనివాసులు, నేతలు మురళి, లోకేష్ పాల్గొన్నారు.

ఐఏఎస్‌వో జాతీయ కార్యదర్శిగా డాక్టర్ నరేంద్ర

తిరుపతి(వైద్యం), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ సర్జికల్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ నరేంద్ర ఐఏఎస్‌వో(ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ సర్జికల్ అంకాలజీ) జాతీయ కార్యదర్శిగా ఎన్నికైనట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం గోవాలో నిర్వహించిన ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ సర్జికల్ అంకాలజీ 38వ జాతీయ సదస్సులో జాతీయ కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్, పలువురు వైద్యాధికారులు ఆయన్ను అభినందించారు.

బీఎస్ఎన్ఎల్ రూపాయి ప్లాన్

30 రోజులు ఉపయోగించుకోవచ్చు

తిరుపతి(సెంట్రల్), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు రూపాయి ప్లాన్ విడుదల చేసింది. రూపాయి సిమ్ కొనుగోలు చేసి యాక్టివేషన్ చేసుకుంటే 30 రోజులు 4జీ మొబైల్ సేవలను ఉచితంగా అందిస్తుందని డీజీఎం వెంకోబరావు ఒక ప్రకటనలో తెలిపారు. దీపావళి రోజు నుంచి నవంబరు 18వ తేదీ వరకు అమలులో ఉంటుందని పేర్కొన్నారు. అపరిమితంగా వాయిస్‌కాల్స్ చేసుకునే అవకాశముందని తెలిపారు. రోజుకు 2జీబీ హైస్పీడ్ డేటాను వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు పంపుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.